# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు జరిగే కలెక్టర్ల సదస్సులో పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తారు.
2. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లాలో ఈ రోజు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారు.
3. ఆంధ్రప్రదేశ్ లో విద్యాశాఖకు సంబంధించిన సమగ్ర డ్యాష్‌బోర్డ్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.
4. వెలిగొండ ప్రాజెక్ట్ వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.
5. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు ఈ రోజు కొనసాగనుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. రెండవ రోజు సమావేశంలో వేసవి ప్రణాళికలు, సంక్షేమం, రెవెన్యూ, విద్య, నైపుణ్యాభివృద్ధి, శాంతి భద్రతలు వంటి అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. నిన్న మొదటి రోజు సమావేశంలో పలువురు కలెక్టర్లు తమ జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా విశాఖ రైల్వే జోన్ పై ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 35 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు నగరానికి చెందిన శ్రీ నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రయివేటు, భాగస్వామ్యం – పీపీపీ విధానంలో ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఈ ఆడిటోరియం పనులను ఏడాది లోపే

పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గుంటూరు నగరానికి సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు ఒక ప్రధాన వేదికగా నిలుస్తుందని తెలిపారు.

---------------------------

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర బొగ్గు గనులు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 10న సికింద్రాబాద్ పరేడ్ మైదానం లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరమని ఆయన అన్నారు. సభ ప్రాంగణం నుంచే తెలంగాణ వ్యాప్తంగా అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో విద్యాశాఖకు సంబంధించిన అన్ని అంశాల కోసం సమగ్ర డ్యాష్‌బోర్డ్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో మంత్రి నిన్న మాట్లాడారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, ఉన్నత విద్యకు సంబంధించిన కీలక పనితీరు సూచికలతో డ్యాష్‌బోర్డ్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. విద్యార్థుల హాజరు, డ్రాప్‌అవుట్లు, మధ్యాహ్న భోజన పథకం వంటి పలు అంశాలను ఇందులో పొందుపరిచామని తెలిపారు. ఫలితాలను మెరుగుపరచడంలో ఈ వ్యవస్థ కలెక్టర్లకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ కు వెలిగొండ ప్రాజెక్ట్ అత్యంత కీలకమని, దీన్ని వేగంగా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. మార్కాపురం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల్లో జరుగుతున్న పనులను మంత్రి నిన్న స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సొరంగాల్లో లైనింగ్, బెంచింగ్ తదితర పనులను తనిఖీ చేసిన మంత్రి, అక్కడ పనిచేస్తున్న కార్మికులు, అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ ప్రాజెక్ట్ ప్రాముఖ్యతను వారికి వివరించి, సిబ్బందిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు సమయం గడిపినట్లు తెలిపారు.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఈ రోజు పర్యటిస్తారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. అలాగే 110 కోట్ల రూపాయలతో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు, 2 కోట్లతో కోస్గిలోని వేణుగోపాలస్వామి ఆలయం అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

అదేవిధంగా 250 కోట్ల వ్యయంతో 430 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో భూసేకరణకు సంబంధించిన అపరిష్కృత సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అదనపు అధికారులను నియమించిందని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ –సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు తెలిపారు. గుంటూరు జిల్లా రాయపూడి గ్రామంలో 43.82 ఎకరాల భూసేకరణ అంశంపై నిర్వహించిన గ్రామసభలో రైతులతో ఆయన నిన్న సమావేశమై చర్చించారు. భూసేకరణకు సంబంధించిన అభ్యంతరాలను స్వీకరించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం విజయరామరాజు పాత్రికేయులతో మాట్లాడుతూ

వాయిస్ 32 సెకన్లు

---------------------------

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. వరదలు, భూకంపాలు, ఇతర, ప్రకృతి వైపరీత్యాలకు గురైన ప్రజలకు సహాయం అందజేయడం, వారి ప్రాణాలను కాపాడడానికి రెడ్ క్రాస్ సంస్థలు చేస్తున్న కృషిని గుర్తించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1948వ సంవత్సరం నుండి ప్రతి ఏటా మే 8వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. మొదటి నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, రెడ్ క్రాస్ సంస్థను ప్రారంభించిన జీన్ హెన్రీ డ్యూనాంట్ స్విట్జర్ లాండ్లోని జెనీవా నగరంలో 1828 మే 8వ తేదీన జన్మించిన సందర్భాన్ని పురస్కరించుకుని... ఆయన జ్ఞాపకార్థం ప్రతి ఏటా మే 8వ తేదీన ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ దిగువ ట్రోపో ఆవరణములో ఆగ్నేయ, నైరుతి గాలులు వీస్తున్నాయని దీని ప్రభావంతో మరో రెండు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రోజు, రేపు కోస్తా, రాయల సీమ జిల్లాలలో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎం. వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్ 22 సెకన్లు

=====================